క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పెదగంట్యాడ: 11కేవీ పిట్టవానిపాలెం ఫీడర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత ప్రాంతాల్లో ఈ నెల 21న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిట్టవానిపాలెం ఫీడర్ పరిధిలోని పిట్టవానిపాలెం, కేఎస్ పాలెం, పెదపాలెం, చినపాలెం, అష్రత్‌నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

చినగంట్యాడ సబ్‌స్టేషన్ పరిధిలో..

గాజువాక: చినగంట్యాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చినగంట్యాడ ఫీడర్‌కు ఈ నెల 21న నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా శ్రామికనగర్, చినగంట్యాడ, కోర్టు ఏరియా, పోలీస్ స్టేషన్ ఏరియా, శ్రీనివాస నగర్, దత్తసాయినగర్, తనిష్క్ ఏరియాలలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బాధితులకు పరామర్శ



గాయాలపాలైన వారిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలోని మునసబు వీధిలో మంగళవారం పాత పెంకుటింటి పైకప్పు కూలిన ఘటనలో గాయాలపాలైన వారిని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ బుధవారం పరామర్శించారు. కూలిన ఇంటిని పరిశీలించి, గాయాలపాలైన బీమున బాలాజీ, మజ్జి లక్ష్మిలను పరామర్శించారు. వీరి వైద్యం నిమిత్తం కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రొక్కం వెంకటరావు, ఈటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనానికి సహకరించాలని వినతి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేలా సహకరించాలని స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంఘం నాయకులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు నాయకులు బుధవారం పల్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అలసత్వం, నిర్లక్ష్యం వల్ల కొన్ని నెలలుగా ప్లాంట్ తీవ్ర గడ్డు పరిస్థితిలోకి నెట్టబడిందన్నారు. తద్వారా 6 నెలలుగా సకాలంలో జీతాలు చెల్లించలేని పరిస్థితికి చేరుకుందన్నారు. ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉంటేనే ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం వల్ల ప్లాంట్‌కు రా మెటీరియల్ లభించడంతో పాటు ఆర్థికంగా పూర్వ వైభవం కలుగుతుందన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు బి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, ఉప ప్రధాన కార్యదర్శి కోయిలాడ శ్రీనివాసరావు తదితరులున్నారు.

26న షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

మురళీనగర్: ఈ నెల 26న హిందుస్థాన్ షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించాలని షిప్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నిర్ణయించింది. మురళీనగర్ వాకర్స్ పార్కులో బుధవారం సాయంత్రం విశ్రాంత ఉద్యోగుల సంఘం నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ రుసుం రూ.250 వసూలు చేయాలని సభ్యులు తీర్మానించారు. ఈ నెల 26న మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో నిర్వహించే ఆత్మీయ సమావేశంలో పలు సమస్యలపై చర్చించడంతోపాటు 80 ఏళ్లు దాటిన వారిని సత్కరించాలని నిర్ణయించారు. సమావేశంలో షిప్‌యార్డ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బి.సూర్యనారాయణ, అధ్యక్షుడు బూసి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భానుడి సెగ.. భగభగ

- వేడి గాలులతో జనం ఉక్కిరిబిక్కిరి
- బయటికి రాలేక ఇంటికే పరిమితం
- రహదారులన్నీ నిర్మానుష్యం



ఎండ నుంచి రక్షణ కోసం గొడుగు వేసుకుని పిల్లలను బడి నుంచి ఇంటికి తీసుకొస్తున్న మహిళ



నిత్యం రద్దీగా ఉండే హౌసింగ్‌బోర్డ్ కాలనీ ప్రధాన రహదారి ఇలా..

పెదగంట్యాడ: భానుడి మహోగ్ర రూపానికి జనం అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయి, వడ గాలులు మళ్లీ ఉధృతం కావడంతో ఉష్ణ తాపానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వెచ్చటి గాలులతో వాతావరణం నిప్పుల కొలిమిలా మారడంతో ముచ్చెమటలతో తడిసి ముద్దయిపోతున్నారు. మూడు రోజులుగా ఉదయం 7 గంటల నుంచి సూర్యాస్తమయం తర్వాత కూడా వేడిగాలులు వీస్తూనే ఉన్నాయి. ఒకపక్క రుతుపవనాల కదలిక మందగించడం.. మరోపక్క సూరీడి ప్రతాపంతో జనం తట్టుకోలేకపోతున్నారు. ఫ్యాన్ తిరుగుతున్నా వేడి గాలి రావడంతో జనం ఇళ్లలో ఉండలేని పరిస్థితి. వృద్ధులు, పిల్లల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మధ్యాహ్నం సమయంలో మండలంలో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలన్నీ జనసంచారం లేక బోసిపోతున్నాయి. అత్యవసర పనులకు సైతం ఎండ సమయంలో బయట వెళ్లాలంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అత్యవసరమైతేనే బయటికి..

పెరిగిన ఎండలు, వేడి గాలుల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావడం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తప్పనసరిగా వెళ్లాల్సి వస్తే ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే బయటకు రావాలని సూచిస్తున్నారు. బయటకు వచ్చే సమయంలో తప్పనిసరిగా తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని. తలపై గొడుగు లేదా టోపీ వంటివి వినియోగించాలని చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలి. ద్రవ పదార్థాలు తీసుకోవడం మంచిది. ఎండ తీవ్రత సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే శ్రేయస్కరం. నోరు, శరీరం పొడిబారినా.. కళ్లు తేలేసినట్టు ఉన్నా.. మగత నిద్ర, పాక్షికంగా అపస్మారక స్థితి ఉంటే వడదెబ్బ లక్షణాలుగా గుర్తించి, వెంటనే చికిత్స చేయించుకోవాలి. వడదెబ్బ తగిలిన వారికి ఎట్టి పరిస్థితుల్లో నీటిని ఇవ్వరాదు, చల్లని ప్రదేశంలో ఉంచి, తడిగుడ్డతో శరీరాన్ని తుడిచి, చల్లని గాలి తగిలేలా ఏదైనా చెట్టు కింద ఉంచి వెంటనే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి.

– డాక్టర్ హేమలత, గంగవరం యూపీహెచ్‌సీ వైద్యాధికారి



ఎండ పడకుండా చున్నీ కట్టుకుని ద్విచక్ర వాహనంపై వస్తున్న మహిళ



నిర్మానుష్యంగా ఉన్న నెల్లిముక్కు ప్రధాన కూడలి



వేడి గాలికి ఇళ్లలో ఉండలేక బయట కూర్చున్న వృద్ధులు

సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన



గ్రామస్తులకు సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమలత

పెదగంట్యాడ: సికిల్‌సెల్ వ్యాధి జన్యు సంబంధమైనది, ప్రాణాంతకం అని గంగవరం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమలత తెలిపారు. ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని గంగవరం యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ వద్ద బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో వ్యాపిస్తుందని చెప్పారు. వ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. సికిల్ సెల్ అనీమియాకు గురైన వ్యక్తుల్లో ఎర్ర రక్త కణాల్లో హిమోగ్లోబిన్ అసాధారణంగా ఉంటుందని, దీని వల్ల ఆ కణాలు గట్టిగా, జిగటగా మారతాయని వివరించారు. వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గంగవరం యూపీహెచ్‌సీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

ఉక్కునగరం: ప్రజల అవసరాల మేరకు ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేసి, ఆర్టీసీని బలోపేతం చేయాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెం డిపోలో బుధవారం నిర్వహించిన ఈయూ సర్వసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత రవాణా ఇస్తున్న సందర్భంగా కొత్త బస్సుల సంఖ్య పెంచాలన్నారు. అదేవిధంగా ఉద్యోగుల నియామకాలు జరపడంతో పాటు 2017 పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను కొత్త ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈయూ జిల్లా అధ్యక్షుడు కె.సత్యమూర్తి మాట్లాడుతూ ఖాళీల మేరకు పదోన్నతులు కల్పించాన్నారు. సమావేశంలో ఈయూ నూతన డిపో అధ్యక్షునిగా కె.ఎస్.ప్రకాశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి బి.రాము, ఆర్.ఎస్.ఎ.రావు, ఐ.ఉమామహేశ్వరరావు, నారాయణమ్మ, పి.ఎ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి తిరువీధి ఉత్సవం



ఘాట్‌రోడ్డు మీదుగా సాగుతున్న తిరువీధి ఉత్సవంలో మహిళల కోలాటం



స్వామి వారి తిరువీధి ఉత్సవం



అలంకరణలో స్వామివారు

దాబాగార్డెన్స్ : ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం తిరువీధి రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విశేష హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు తిరువీధి రథయాత్ర చేపట్టారు. స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన తిరువీధి రథయాత్ర ఘాట్‌రోడ్డు, పూర్ణామార్కెట్, పోలీస్ బ్యారెక్స్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా తిరిగి సత్యనారాయణస్వామి ఆలయం వరకు సాగింది. దారి పొడవునా కోలాటం.. సంకీర్తనలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో బుద్ధ నాగజగదీష్ పర్యవేక్షించారు.

నేడు వైదిక సదస్యం

దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు, 9 గంటలకు సుదర్శన హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్యం, మహదాశీర్వచనం (పండిత సత్కారం) చేపట్టనున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

మహారాణిపేట : రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, బోధకాలు వంటివి రాకుండా కాపాడుకోవాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ దోమల వ్యాప్తిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ దోమల నుంచి రక్షణకు దోమ తెరలు వాడాలన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) సమన్వయకర్త డాక్టర్ సమత తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతో స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం

అగనంపూడి: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తే పూర్వ వైభవం చేకూరుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ప్రగడ వేణుబాబు, ఎన్నేటి రమణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1224వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగుతున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల ఎవరికి ఏ లాభం చేకూరుతుందో తెలియదు గానీ, భారతదేశం జాతి రత్నాన్ని కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్కు కర్మాగారం ఉనికిని కోల్పోతే దేశంతో పాటు ఆంధ్ర రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఐక్యతతో స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుందామన్నారు. కార్యక్రమంలో దుగ్గపు దానప్పలు, ఈశ్వరరావు, హరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపనిషత్తులు విలువైన సంపద

సీతంపేట: వేదాలు, ఉపనిషత్తులు భారతీయ సమాజం, పాశ్చాత్య సమాజాల మీద ప్రభావం చూపాయని కవి, రచయిత డాక్టర్ కె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'ఉపనిషత్తులు మన విలువైన సంపదలు' అనే అంశంపై జరిగిన సాహిత్య సభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. వేద కాలం పూర్వం నుంచి నేటి ఆధునిక సమాజం వరకు వేదాలు, ఉపనిషత్తులు భారతీయ, పాశ్చాత్య సమాజాలపై ఏ మేరకు ప్రభావం చూపాయో, వాటి అర్థాలను వివరించారు. అరిస్టాటిల్, వివేకానందుడు నుంచి నేటి ఆధునిక కవులు, తత్వవేత్తల మీద ఉపనిషత్తుల ప్రభావాన్ని తెలియజేశారు. గ్రీకు నుంచి అమెరికా వరకు పాశ్చాత్య కవులు వీటిని ఏ మేరకు ఆదరించారో వివరించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వేదాల్లోని నాలుగు భాగాల్లో ఉపనిషత్తులు ఒకటని పేర్కొన్నారు. ఇది పూర్తిగా జ్ఞాన కాండ అని, నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరమైనదని అన్నారు. డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ ఉపనిషత్తులు మన పూర్వీకులు మనకు అందించిన అమూల్యమైన జ్ఞాన సంపదగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్ కుమార్, సిహెచ్.చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ, చింతా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యం



అవగాహన సదస్సులో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు తదితరులు

గాజువాక: రానున్న వంద రోజుల్లో డ్రగ్స్‌ను నిర్మూలించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. డ్రగ్స్ వల్ల నష్టాలపై స్థానిక టీఎస్సార్, టీబీకే కళాశాలలో పోలీసులు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ నిర్మూలనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తోందన్నారు. అందులో భాగంగానే విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మంచి ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు కళాశాలల యాజమాన్యాలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీ మేకా సత్తిబాబు, సౌత్ ఏసీపీ త్రినాథ్, కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ప్రశాంత జీవనం



మాట్లాడుతున్న రాజయోగి బీకే చంద్రశేఖర్



యోగాసనాలు వేస్తున్న ధ్యానులు

అగనంపూడి: మానసిక ఆందోళనలు, శారీరక రుగ్మతల నుంచి బయటపడడానికి యోగ సాధన ఒక్కటే మార్గమని రాజయోగి బ్రహ్మకుమారి చంద్రశేఖర్ భాయీజీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీస్ అగనంపూడి శాఖ దివ్యజ్యోతి భవనం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక యోగా శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. మానసిక ఆనందం, పరిపక్వతకు యోగా, ధ్యానం చక్కటి మార్గమన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ రాజయోగి బీకే సోమేశ్వరి మాట్లాడుతూ నిజజీవితంలో మనిషి మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. చదువుకునే విద్యార్థి నుంచి వయో వృద్ధుల వరకు మానసిక ఆందోళనలకు గురవుతున్నారని, వీటన్నింటికీ చక్కని మార్గం యోగసాధన అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ యోగాసనాలు, వాటి వల్ల కలిగే ఆరోగ్యపరమైన ఉపయోగాలు వివరించారు. ప్రాణాయామం, ధ్యానం చేయించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, అగనంపూడి దివ్యజ్యోతి భవనం ఇన్‌చార్జి బీకే రామకోటి తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్సీ సన్యాసినాయుడు, ఐఈఆర్‌టీ కో–ఆర్డినేటర్ గీత

పెదగంట్యాడ: స్థానిక భవిత కేంద్రాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, డీఈవో చంద్రకళ, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ గురువారం సందర్శించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. పచ్చదనం పరిరక్షణలో భాగంగా ఎమ్మెల్యే, కలెక్టర్ ఈ కేంద్రంలో మొక్కలు నాటనున్నారు. అలాగే ఇక్కడ కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించనున్నారు. ఈ మేరకు కేంద్రంలోని ఏర్పాట్లను జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, ఐఈఆర్‌టీ కో–ఆర్డినేటర్ గీత, ఎంఈవో శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. జీవీఎంసీ సిబ్బంది కేంద్రంలోని చెత్తాచెదారాన్ని తొలగించి, శుభ్రం చేశారు.

డెంగ్యూపై అప్రమత్తత అవసరం



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ర్యాలీ ప్రారంభిస్తున్న టౌన్ అడ్మిన్ జీఎం చంద్రశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో బుధవారం డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా జిల్లా మలేరియా అధికారిణి ఎం.తులసి ఆదేశాల మేరకు గాజువాక మలేరియా యూనిట్ సీనియర్ ఎంటమాలజిస్ట్ కె.వరహాలదొర పర్యవేక్షణలో కాలనీలో ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ రాకుండా చర్యలు తీసుకోవాలంటూ బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్లు కుమార్, నాయుడు మాట్లాడుతూ డెంగ్యూ రాకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంట్లో, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ అడ్మిన్ విభాగాధిపతి చంద్రశేఖర్, పబ్లిక్ హెల్త్ విభాగం డీజీఎం చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ఎన్నికలు జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రామిక సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వెంటనే జరిపించాలని విశాఖ ఉక్కు శ్రామిక సంఘం అధ్యక్షుడు ఎం.కోటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉక్కు కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు సాధించడంలో ఏఐటీయూసీ పూర్తిగా విఫలం చెందిందన్నారు. కార్మికుల హక్కులకు ఒక్కొక్కటి చొప్పున తాకట్టు పెట్టిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. అన్ని కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్లను వ్యాపార కేంద్రాలు మార్చారన్నారు. యూనియన్ గుర్తింపు ఈ నెల 9తో ముగిసినందున వెంటనే ఎన్నికలు జరిపించాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కరణం సత్యారావు, బొడ్డు రమణ, కరణం సురేష్, యు అప్పలరాజు, కె.బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ టెక్నీషియన్లకు ప్రత్యేక సదస్సు



సెమినార్‌లో పాల్గొన్న టెక్నీషియన్లతో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రైలు ఎస్కార్టింగ్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లకు బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. రైలులో ఎలక్ట్రికల్ విధులు నిర్వర్తించే సిబ్బందికి నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ సెమినార్ ఏర్పాటు చేశారు. రైళ్లలో ప్రయాణించే సమయంలో ఎదురయ్యే లైటింగ్, ఏసీ, థర్మల్ కంఫర్స్ వంటి సమస్యలను పరిష్కరించడంలో వీరు కీలకపాత్ర పోషిస్తుంటారు. ప్రయాణికులకు సుఖవంతమైన, సౌకర్యవంతమైన, భద్రతతో కూడిన ప్రయాణాన్ని అందించేందుకు వీరు నిత్యం రైళ్లలో ప్రయాణిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తుంటారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికులకు అత్యంత ప్రమాణాలతో కూడిన సేవలందించడమే తమ ప్రాధాన్యమని తెలిపారు. కౌన్సెలింగ్ సెమినార్ ద్వారా భద్రత, సురక్షితం గురించి టెక్నీషియన్లకు ఎన్నో విషయాలు తెలియజేసినట్లు చెప్పారు. ఆయా విభాగాల మధ్య ఉన్నతాధికారులతో కమ్యూనికేషన్ విధానాలు, టీం వర్క్, సహకారం అంశాలపై వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి నిర్వాసిత కాలనీల సమస్యలు



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న నిర్వాసిత నాయకులు

అగనంపూడి: నిర్వాసిత కాలనీల అభివృద్ధి, నిర్వాసితుల ఉపాధికి సహకరించాలని కోరుతూ అగనంపూడి నిర్వాసితులు గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. శ్రీనివాసరావును గాజువాకలో కలిసిన నాయకులు మాట్లాడుతూ అగనంపూడి టోల్‌గేటును ఎత్తివేయాలని, అగనంపూడిలో రైతుబజారు ఏర్పాటు చేయాలని, నిర్వాసిత కాలనీల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక పశువైద్యశాలకు భవనం నిర్మించాలని, అగనంపూడి కూడలిలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు తోకాడ రాము, బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, కట్టా పైడిరాజు, కోసూరి తాతారావు, కసిపల్లి శ్రీనివాసరావు, ఈగల నరసింగరావు ఉన్నారు.